క్లుప్తంగా

'పరిధి దాటి వైద్యం చేయవద్దు'

టెక్కలి: గ్రామీణ వైద్యులు (ఆర్‌ఎంపీ) వారి పరిధి దాటి వైద్యం చేయవద్దని యురాలజీ వైద్యుడు సందీప్‌వర్మ సూచించారు. ఆదివారం టెక్కలిలో ఆర్‌ఎంపీ వైద్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ సంబంధిత వ్యాధులను ఏ విధంగా గుర్తించాలో అవగాహన కల్పించారు. అనంతరం గ్రామీణ వైద్యుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తారు రాజశేఖర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందజేసే ఆర్‌ఎంపీలు చేసే ప్రథమ చికిత్స విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అవగాహన లేని వైద్యం చేయవద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి.భాస్కరరావు, ప్రతినిధులు టి.యాదవరావు, రమణమూర్తి, తవిటిరాజు, శివ, బాలరాజురెడ్డి, మహాపాత్రో, వెంకట్రావు, రామచంద్రరావు ఉన్నారు.

ఈ–శ్రమలో పేర్లు నమోదు చేసుకోండి


మాట్లాడుతున్న రామారావు

కాశీబుగ్గ: అసంఘటిత కార్మికుల సంక్షేమ కోసం ఏర్పాటు చేసిన ఈ–శ్రమలో కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆదివారం సూచించారు. వ్యవసాయ రంగ, ఆశవర్కర్లు, వలస కార్మికులు, ఇళ్లు, దుకాణాలలో పనిచేసే కార్మికులు, కొరియర్‌బాయ్స్, తోపుడు బండి వర్తకులు, మత్స్యకార తదితర కార్మికుల కోసం కార్యక్రమం ప్రభుత్వం ఈ–శ్రమను ప్రవేశపెట్టిందన్నారు. 16 నుంచి 59 సంవత్సరాల వయసు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు అన్నారు. ఈ పథకంలో చేరాలనుకునేవారు ఈ–శ్రమ పోర్టల్‌లో పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో లేదా సచివాలయాల్లో పేర్లను నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

ఏపీపీగా జగన్నాయకులు



సోంపేట: సోంపేట అడిషనల్ జిల్లా న్యాయస్థానం ఏపీపీగా దువ్వు జగన్నాయకులు ఎంపికయ్యారు. మందస మండలం బెల్లుపటియా గ్రామానికి చెందిన ఈయన సోంపేట కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు న్యాయవాదులు జగన్నాయకులకు అభినందనలు తెలియజేశారు.

శిలాఫలకం ధ్వంసం


ధ్వంసమైన శిలాఫలకం


కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో బావి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని శనివారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. చాలా ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన బావి ప్లాట్‌ఫాం పాడవడంతో పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ సైని దేసయ్య, ఎంపీటీసీ సభ్యులు కోరాడ నిరోష, ధనరాజ్ పేర్లతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు దీన్ని ధ్వంసం చేయడంతో సర్పంచ్ సైని దేసయ్య అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా తులసమ్మ సంబరం


అమ్మవారి రూపాలను ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆంధ్రా, ఒడిశా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని ఊరేగించి సంబరాలు నిర్వహించారు.

పోటెత్తిన భక్తులు


ఆలయంలో క్యూలైన్‌లో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఘటాలతో తరలి వచ్చారు. తెల్లవారు జాము నుంచే భక్తులు చేరుకుని అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైద్యం ఎండమావే!

- సీహెచ్‌సీలో సమస్యల తిష్ట
- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- రోగులకు అందని భోజనం
- మూలకు చేరిన ఆక్సిజన్ ప్లాంట్


ఇచ్ఛాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం


క్యూలైన్లో వేచిఉన్న రోగులు


మరమ్మతులకు గురైన ఆక్సిజన్ ప్లాంట్

ఇచ్ఛాపురం: నియోజకవర్గ కేంద్రమైన ఇచ్ఛాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో సమస్యలు తిష్టవేశాయి. దీంతో ఇక్కడ వైద్యం ఎండమావిగా మారింది. ఎన్నో ఆశలతో చికిత్స కోసం వస్తున్న రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందక అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక చాలామంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి వీలుగా సీహెచ్‌సీలో లక్షలాది రూపాయలు వెచ్చించి అవసరమైన మౌలిక వసతులను సమకూర్చింది. దీంతో ఆస్పత్రికి రోగులు భారీగా వచ్చి వైద్య సేవలు పొందేవారు. రోజుకు కనీసం 250 మంది వరకూ ఓట్ పేషంట్లు వచ్చేవారు. సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేవారు. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చాక బదిలీలు, ఇతరత్రా కారణాలతో ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఏర్పడింది. గతంలో ఎనిమిది మంది వైద్యులు ఉండేవారు. ఇప్పుడు ఐదుగురే అందుబాటులో ఉన్నారు. మత్తు వైద్యుడు, రెండు జనరల్ డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే నర్సింగ్ సిబ్బందిలో రెగ్యులర్ విధానంలో ఇద్దరు, కాంట్రాక్టు ప్రాతిపదికన నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి డాక్టర్లు, ఇతర సిబ్బంది 40 మంది ఉండాల్సి ఉండగా అందులో సగం కూడా లేని పరిస్థితి ఇక్కడ నెలకుంది. పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న సిబ్బంది పనిభారాన్ని ఎదుర్కొంటున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు గంటల తరబడి వేచిఉండాల్సి వస్తుంది. వైద్యులు తగినంత మంది లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య కూడా 250 నుంచి 120కి పడిపోయింది. ప్రసవాల సంఖ్య కూడా తగ్గిపోయింది. అలాగే అత్యవసర సమయంలో అవసరమైన రోగులకు అందజేసే ఆక్సిజన్ పైప్‌లైన్ లీక్ కావడంతో మూలకు చేరింది. ప్రస్తుతం ఆక్సిజన్ సిలిండర్లు, కానసన్‌ట్రేటర్లను వినియోగించి వైద్యసేవలు అందిస్తున్నారు. ఇక ఇన్ పేషంట్లకు భోజన సదుపాయం కూడా లేకుండా పోయింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం విప్ బెందాళం అశోక్ వైద్యులైనప్పటికీ నియోజకవర్గ కేంద్రంలోని సీహెచ్‌సీలో ప్రజలకు సరైన వైద్య సేవలు అందకపోయినప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టిసారించి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలి



సీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో వైద్యులు నియమించి స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించాలి. పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టిసారించాలి. స్థానిక ఎమ్మెల్యే కూడా వైద్యులే కాబట్టి పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

–సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఇచ్ఛాపురం

రోగులకు భోజన సదుపాయం కల్పించాలి



ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేది పేదవారే. వారికి మెరుగైన వేద్యంతోపాటు ఉచితంగా భోజన సదుపాయం కల్పించాలి. ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో ప్రస్తుతం రోగులకు భోజనం అందించడం లేదు.

–జి.చలపతి, రోగి, ఇచ్ఛాపురం

ఉన్నతాధికారులకు నివేదించాం



సీహెచ్‌సీలో నెలకున్న సమస్యలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. రోగులకు భోజన సదుపాయం కల్పించేందుకు కాంట్రాకర్లు ముందుకు రావడం లేదు. ఈ విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు.

–డాక్టర్ పి.దేవేంద్ర, వైద్యాధికారి, సీహెచ్‌సీ, ఇచ్ఛాపురం

రోడ్లపైనే చెత్త!


రత్తకన్న దేవరవీధి కూడలిలో రోడ్డుపైనే చెత్తపోగు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎక్కడిక్కడ చెత్త పేరుకుపోతుంది. అయినప్పటికీ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. వీకేపేట–బలరామపేట కూడలి, బజారుకూడలి, రదందకన్న దేవరవీధి కూడలిలో చెత్తసేకరణ సక్రమంగా జరుగడం లేదు. ఈ ప్రాంతాల్లో ఉంటున్నవారు రోడ్లపైనే చెత్తను పడేస్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ జరుగుతోందని మున్సిపల్ అధికారులు చెబుతున్నప్పటికీ ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదు. ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాల నుంచి వచ్చే చెత్తను వేయడానికి డంపింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ డస్ట్‌బిన్స్ మాత్రం పెట్టలేదు. దీంతో చెత్తను రోడ్లపైనే జనం వేస్తున్నారు. ఇందులో ప్లాస్టిక్‌తో ఇతర హానికర పదార్థాలు ఉంటున్నాయి. వీటిని పశువులు తింటూ అనారోగ్యం పాలవుతున్నాయి. అధికారులు స్పందించి పారిశుద్ధ్యం క్షీణించకుండా డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య కార్యకర్తలకు అవకాశం

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి ప్రాజెక్టులో ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని జార్జి ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్దాన ప్రాంతంలో రక్తనమూనాలను ప్రోత్సహించటానికి, డేటా సేకరణ గుర్తింపు నమోదు చేసేందుకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్దాన మండలాల్లో నివాసం ఉండేవారు అర్హులన్నారు. పూర్తి వివరాల కోసం కిడ్నీ ఆస్పత్రి పరిశోధన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

కారును ఢీకొట్టిన ట్యాంకర్

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం జర్జంగి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం సంభవించింది. టెక్కలి నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారును కోటబొమ్మాళి మండలం జర్జంగి సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన అయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న విశాఖకు చెందిన పురోహితుడికి ఎటువంటి ప్రమాదం జరుగలేదు. ప్రమాదానికి కారణమైన లారీని అదుపులో తీసుకుని కేసునమోదు చేసినట్లు కోటబొమ్మాళి ఎస్‌ఐ వి.సత్యానారాయణ తెలిపారు.

దిగివస్తున్న వెల్లుల్లి


అమ్మకానికి ఉంచిన వెల్లుల్లి

నరసన్నపేట:

సామాన్యులకు అందనంత ధరకు చేరిన వెల్లుల్లి ప్రస్తుతం దిగి వస్తోంది. మొన్నటివరకు 250 గ్రాముల ధర రూ.90ల వరకు ఉండగా, ప్రస్తుతం రూ.30లకు లభిస్తోంది. ఆదివారం నరసన్నపేటలో 500 గ్రాముల వెల్లుల్లి ధర రూ.50లకు హోల్‌సేల్‌గా విక్రయించారు. దీంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ ధరలు కొద్దిరోజులు ఉండవచ్చని, మళ్లీ పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు అంటున్నారు.

పేదల కాలనీని పట్టించుకోరా?

- జగనన్న కాలనీపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- మౌలిక సదుపాయాలు కల్పించకుండా వివక్ష
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


అధ్వానంగా ఉన్న కాలనీలోని రోడ్డు


మోటారు చోరీకి గురవ్వడంతో నిరుపయోగంగా ఉన్న బోరు

ఇచ్ఛాపురం: పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. ప్రతీ లేఅవుట్‌లో లబ్ధిదారుల అవసరాల కోసం మౌలిక సౌకర్యాలు కూడా సమకూరుస్తుండేది. అయితే ఆ తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాలనీలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పన పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని పేదలకు సొంతిల్లు నిర్మించేందుకు రత్తకన్నలో మూడు లేఅవుట్‌లు, డిగ్రీ కళాశాల సమీపంలో రెండు లేఅవుట్లలో సుమారు 1210 మంది లబ్ధిదారులకు కేటాయించగా 70 శాతం నిర్మాణాలు జరిగాయి. వీరు నిర్మాణాలు చేసేందుకు అప్పటి ప్రభుత్వమే బోర్లను ఏర్పాటు చేసి నీటి సరఫరా నిమిత్తం మోటార్లను కూడా అమర్చారు. అయితే ఈ మోటార్లు చోరీకి గురవ్వడంతో నీటిసఫరా లేకపోవడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పాతాళసిద్ధేశ్వరాలయం సమీపంలోని లేఅవుట్‌లో నిర్మాణాలు పూర్తి చేసుకున్నప్పటికీ వీధుల్లో సరైన రోడ్లు, కాలువల నిర్మాణాలు జరుగలేదు. గతంలో ఈ కాలనీల నిర్మాణ పనులు మొదలైనప్పుడు విద్యుత్ కనెక్షన్‌తో పాటు లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్ల సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం నిర్మాణాలు పూర్తిచేసుకున్న లబ్ధిదారులు విద్యుత్ మీటర్‌కి దరఖాస్తు చేసుకుంటే సుమారు రూ. 1900 నుంచి మూడు వేల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. రోడ్లు, కాలువలు, విద్యుత్ దీపాలు, నీటి సరఫరాను సమకూర్చకపోవడంతో నిర్మాణాలు పూర్తిచేసుకున్న లబ్ధిదారులు అలాగే అసంపూర్తి నిర్మాణాలు పూర్తిచేసుకోవడానికి ముందుకు రావడంలేదు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి నెలాఖరుకు నిర్మాణాలు పూర్తిచేసిన వారికే బ్యాంక్ రుణాలు ఇవ్వనున్నట్లు సూచించడంతో లబ్ధిదారుల్లో ఆందోళననెలకొంది. అధికారులు నిర్మాణాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలిస్తున్నాం. లేఅవుట్లోని సమస్యలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకొంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం.

–ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

వసతులు కల్పించాలి



కాలనీలో లబ్ధిదారులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించాలి. రోడ్లు, కాలువలు, నీటిసరఫరాను కల్పించాలి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–జి.జోగారావు, లబ్ధిదారుడు

చీకట్లో ఉంటున్నాం



కాలనీలో గతంలో ఉచితంగా విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మీటర్ ఏర్పాటుకు డబ్బులు చెల్లించవలసి వస్తుంది. విద్యుత్ దీపాలు లేకపోవడంతో కాలనీ మొత్తం చీకటిగా ఉంటుంది. సమస్యను పరిష్కరించాలి.

–జి.మోహినమ్మ, లబ్ధిదారుడు

ప్రారంభానికి సిద్ధంగా..



టెక్కలి పరిసర ప్రాంతాల్లో మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉన్నటువంటి గిరిజనులు పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు విక్రయించేందుకు వీలుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టెక్కలిలో గిరిజన ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని నిర్మించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో స్థానిక కంకరబంద సమీపంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రారంభం సమయంలో ఎన్నికల రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఈ కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ కేంద్రం ద్వారా గిరిజనులు పండించిన వివిధ రకాల అటవీ ఉత్పత్తులను గిరిజన కార్పోరేషన్ ఆధ్వర్యంలో విక్రయించనున్నారు. మరికొన్ని రోజుల్లో ఈ కేంద్రంలో అటవీ ఉత్పత్తులు పట్టణవాసులకు అందుబాటులో రానున్నాయి.

–టెక్కలి

అగ్రిగోల్డ్ ఏజెంట్ల సమావేశం..



అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సంబంధిత అసోసియేషన్ రాష్ట్ర మహిళ కార్యదర్శి పుక్కళ్ల ఆరేలమ్మ కోరారు. అగ్రిగోల్డ్ ఏజెంట్లు సమావేశాన్ని సోంపేటలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 19, 20 తేదీల్లో అన్ని జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు, 24న కలెక్టర్ కార్యాలయంలో విజ్ఞాపన పత్రాలు అందజేయాలన్నారు. ఏజెంట్లు ఇ.భాస్కరరావు, ఎస్.లక్ష్మీనారాయణ, పి.లోకనాథం పాల్గొన్నారు.

–సోంపేట

కమనీయం..వేంకటేశ్వరుని కల్యాణం



కవిటి మండలం కె.కొత్తూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయం నూతన విగ్రహ ప్రతిష్ట మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం కన్నులపండువగా నిర్వహించారు. జీవీ నరసింహం స్వామి, మన్మథరావు స్వామిల ఆధ్వర్యంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు జగతికి చెందిన భావన వంశీయుల ఆధ్వర్యంలో వేకువ జామున సుప్రభాత సేవ, నిత్యదర్శనాలు, విశ్వక్సేనపూజ, నవకలశస్థాపన, లోకకల్యాణార్థం శాంతిహోమాన్ని చేపట్టారు. పరిసర అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

–కవిటి

ఇన్‌చార్జిలే దిక్కు!


తహసీల్దార్ కార్యాలయం

- తహసీల్దార్, డీటీ పోస్టులు ఖాళీ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

సంతబొమ్మాళి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గం పరిధిలోని సంతబొమ్మాళి మండల తహసీల్దార్ కార్యాలయం ఇన్‌చార్జిల పాలనలో కొనసాగుతుంది. కీలక పోస్టులకు రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్, ముగ్గురు వీఆర్వోలు, ఇద్దరు సచివాలయ సర్వేయర్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఆర్.రమేష్‌కు మార్ ఉద్యోగ విరమణ చేసి నెలలు గడిచిన ఆ పోస్టులో ఇంతవరకు ఎవ్వరూ చేరలేదు. దీంతో కోటబొమ్మాళి మండల తహసీల్దార్ ఆర్.అప్పలరాజు ప్రస్తుతం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన ప్రవీణ్‌కుమార్ బదిలీపై వెళ్లిపోగా ల్యాండ్ సర్వే డీటీ హరి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు ఖాళీగా ఉండడంతో వీఆర్‌ఏ శంకర్ ఆ బాధ్యతల్లో ఉన్నారు. అలాగే హనుమంతునాయుడు పేట, దండుగోపాలపురం, ఆర్.హెచ్.పురం సచివాలయాలకు వీఆర్వోలు లేరు. గ్రామ సచివాలయ సర్వేయర్ల పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో రైతులు, విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల కోసం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగవలసి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు వివిధ పత్రాలు కావాలంటే రెవెన్యూశాఖ చాలా కీలకమైనది. గ్రామాల్లో ఏం చేయాలన్నా రెవెన్యూ శాఖ అధికారులు ఉండాల్సిందే. అలాంటిది కీలకపోస్టులకు మంత్రి అచ్చెన్నాయుడు ఇలాకాలో అధికారులు లేకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులు అప్పుడప్పుడు చుట్టం చూపుగా వచ్చి పోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుఉల స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ తరువాత పోస్టింగులు



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో పోస్టింగులు ఇవ్వలేదు. ఎన్నికల కోడ్ అనంతరం పోస్టింగులు ఇస్తాం. సిబ్బంది ఖాళీల వివరాలను మంత్రి, జిల్లా కలెక్టర్‌కు తెలియజేశాం.

– కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

ఆదివాసీల బతుకులు అంధకారం చేయొద్దు

బూర్జ: థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో ఆదివాసీల బతుకులను అంధకారం చేయొద్దని మానవ హక్కుల వేదిక కన్వీనర్ వి.ఎస్.కృష్ణ, థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కోరారు. బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టవద్దని కోరుతూ మండలంలోని జె.వి.పురం గిరిజన గ్రామంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం ప్రతిపాదనలు ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే మరో గిరిజన పోరాటానికి ఆదివాసీలు సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు. ఆదివాసీ గ్రామాల పరిధిలో సుమారు 1,600 ఎకరాలు విస్తీర్ణంలో, రూ.30 వేల కోట్లుతో 3,200 మెగావాట్లు సామర్థ్యం కలిగిన క్రిటికల్ సూపర్ థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనలు సరికాదన్నారు. బొగ్గు అధారిత పవర్ ప్లాంట్ వలన ఆదివాసీల పోడు వ్యవసాయం నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.